## సహాయ గుణం అలవర్చుకోవాలి - నారంశెట్టి ఉమామహేశ్వరరావు

పిల్లలూ! ఈ నెల మనమొక కొత్త విషయం తెలుసుకుందాం. మంచి అలవాటుగా మార్చుకుందాం. అందుకోసం ముందుగా మనమొక కథ తెలుసుకుందాం.

ఒక సాధువు స్నానం చెయ్యడానికి చెరువుకి వెళ్ళాడు. కాషాయ వస్త్రాలను గట్టు మీద పెట్టి నీట్లోకి దిగబోతుంటే చెట్టు మీద నుండి ఒక తేలు నీట్లో పడడాన్ని చూసాడు. ఒడ్డుకి రావాలని ప్రయత్నించిందా తేలు. వీలు కాక మునిగి పోసాగింది. అది చూసిన సాధువు దాన్ని కాపాడాలన్న ధ్యేయంతో ఒక ఎండుటాకుని అందించాడు. ఆకు మీదకు పాకింది తేలు. దాన్ని గట్టు మీద దించాలనుకున్నాడు సాధువు. అంతలోనే అతడి చేతి మీద కుట్టింది తేలు . బాధతో చెయ్యి విదిలించాడు సాధువు. ఆకు కదలడంతో నీట్లో పడింది తేలు. 'అయ్యో' అని జాలిపడ్డ సాధువు, ఆకుని మళ్లీ అందించాడు. ఆకు మీదకు చేరిన తేలు, సాధువుని కుట్టింది మళ్లీ . ఈసారి కూడ సాధువు చెయ్యి విదిలించడంతో నీట్లో పడింది తేలు. మళ్లీ జాలి కలిగింది సాధువుకి. ఆకుని మళ్లీ అందించాడు. మరోసారి కుట్టింది తేలు. అది కుట్టడం , ఇతను చెయ్యి విదిలించడం … అలా చాలాసార్లు జరిగింది.

అప్పుడే చెరువుకి స్నానానికి వచ్చిన ఒక వ్యక్తి సాధువు చేస్తున్న పనిని చూసాడు. అతడికి చిరాకు కలిగింది. అతని దగ్గరకు వెళ్లి "నీకూ సిగ్గు లేదు. దానికీ సిగ్గు లేదు. ఎన్నిసార్లు కుడుతున్నా మళ్ళీ మళ్ళీ కుట్టించుకుంటున్నావు. నీకు బుద్ధి ఉండే చేస్తున్నావా ?" అనడిగాడు కోపంగా.

ఆ మాటలకి సాధువు కోపం తెచ్చుకోలేదు. తేలుని ఒడ్డున పడెయ్యడం మీదనే దృష్టి నిలిపాడు. ఎలాగోలా దాన్ని ఒడ్డున పడేశాక గ్రామస్తుడి వైపు తిరిగి "నాకు బుద్ధి ఉంది కాబట్టే అది కుడుతున్నప్పటికీ ఓర్చుకుని సహాయం చేశాను. కుట్టడం దాని స్వభావం. దాని పని అది చేసింది. మనిషిగా ప్రక్కవాళ్ళకి సాయం చెయ్యడం నా స్వభావం. అందుకే నా వంతు సహాయం చేసాను. ఆలోచన, బుద్ధి రెండూ లేని తేలు లాంటిదే దాని స్వభావం చూపినప్పుడు , ఆ రెండూ ఉన్న నేను నా సహజ స్వభావం వదిలేసి పోగలనా? సహాయం చెయ్యడం మానగలనా?" అని నవ్వుతూ బదులిచ్చాడు.

ఈ కథ చదివిన తరువాత మీకొక విషయం బోధపడి ఉండాలి. మనుషులు సాటివారికి సహాయపడాలని. అదే మనం ఈ నెల తెలుసుకోబోతున్న అంశం —- సహాయ గుణం అలవరచుకోవడం.

ప్రపంచంలో మనిషిని గొప్పవాడిగా నిలిపే గుణాల్లో సహాయ గుణం ఒకటి. సాధ్యమైనంతలో ప్రక్కవారికి సాయం చెయ్యడం గొప్ప లక్షణం. చిన్నదైనా, పెద్దదైనా సాయం సాయమే. సాటి వాళ్ళు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలబడటం, బాధల్లో ఉన్న వాళ్లకు మేమున్నామని భరోసా ఇవ్వడం, ఓదార్చడం … ఇవన్నీ సహాయ గుణంగానే భావించాలి. సహాయం చెయ్యాలనే భావం హృదయంలో నుంచి పుడుతుంది. ఈ స్వభావాన్ని చిన్నప్పటి నుంచి పిల్లలు అలవర్చుకోవాలి.

బడి పిల్లాడు పాఠశాలకి వెళ్ళిన తరువాత ఏదైనా పుస్తకం తేవడం మరిచిపోయినట్టు తెలిసినప్పుడు , తోటి పిల్లలు తమ పుస్తకాన్ని ఇవ్వడం, ఒక విద్యార్థి హోంవర్క్ చెయ్యడంలో ఇబ్బంది పడుతుంటే మిగతా పిల్లలు అతడికి సాయం చెయ్యడం, ఎవరైనా దారిలో జారిపడితే చెయ్యి అందించి నిలబెట్టడం, అమ్మానాన్నలకి చిన్నచిన్న పనుల్లో ఇంట్లో సాయం చేయడం, వృద్ధులు , గుడ్డివాళ్ళు, అంగవైకల్యం ఉన్నవాళ్లు ఎదురైతే చేయూత నిచ్చి రోడ్డు దాటించడం, వాళ్ల చేతిలోని బరువుల్ని అందుకుని మోయడం వంటివన్నీ సహాయ గుణాలే. ఇంకా చెప్పాలంటే ఆకలితో ఉన్నవారికి ఆహారం ఇవ్వడం , వరదలు, భూకంపాలు లాంటి విపత్తులు వచ్చినప్పుడు సర్వస్వం కోల్పోయిన వాళ్లకి డబ్బు, వస్తువులు , దుస్తులు వంటివి సాయం చెయ్యడం, ఒకవేళ సొంతంగా ఇచ్చే స్థోమత లేకపోతే విరాళాలు, చందాలు సేకరించి పంపడం కూడా సహాయ పడే మనస్తత్వానికి అద్దం పడతాయి.

ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా తోటివాళ్ళకి ఇవ్వడమే ఉపకారం. దానినే సహాయ గుణం, దాతృత్వం అంటాము. మన సంస్కృతిలో దానగుణానికి ఉత్తమ స్థానం కల్పించడం వల్ల ఇతరుల అవసరానికి ఆదుకునే మనస్తత్వం మనుషుల్లో కలిగింది.

“కృత యుగంలో తపస్సుతో, త్రేతా యుగంలో విజ్ఞానంతో, ద్వాపర యుగంలో యజ్ఞయాగాదులతో, కలి యుగంలో దానంతో మానవులు మోక్షపథాన్ని పొందుతారని” మన శాస్త్రాలు చక్కగా వర్ణించాయి. అందువల్లనే దానగుణం చూపిస్తూ ఎందరో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగైనా కొందరికి మేలు జరుగుతుండటం సంతోషించాల్సిన విషయం.

“కూడబెట్టిన తేనెను తినకుండా, పంచకుండా పశ్చాత్తాపపడిన తేనెటీగల మాదిరి కాకుండా సంపాదించిన ధనాన్ని దానధర్మాలకు వినియోగించాలని” చాణక్యుడు కూడ బోధించిన విషయం ఈ సందర్భంలో గుర్తు చేసుకోవాలి.

మీకో సందేహం కలగవచ్చు. అసలు సహాయం ఎందుకు చేయాలి. ఎవరికి వాళ్ళు ఎదగలేరా? అని అనిపించవచ్చు.

సమాజంలోనిప్రజలందరి అవసరాలు తీరేలా సమస్తమూ దేవుడు సమకూర్చక పోవచ్చు. కొందరికి ఐశ్వర్యం , ఆరోగ్యం ప్రసాదించి ఉండొచ్చు. మరికొందరికి నిలువ నీడ లేకపోవచ్చు. ఏమీ లేని వారికి సంపద ఉన్నవాళ్లు ఆదుకోవడం కనీస ధర్మంగా భావించాలి. పేదరికం, అంగవైకల్యం, అనారోగ్యంతో మంచాన పడి ఏమీ చేసుకోలేక సాయం కోసం ఎదురుచూసే వాళ్లు సమాజంలో ఎదురౌతుంటారు. అలాంటి వాళ్లకు చేయూత ఇవ్వాలి .

“రక్త దానం, అవయవ దానం, నేత్ర దానం, గోదానం” మొదలైన పదమూడు దానాల మహిమల్ని పురాణాలు చర్చించాయి. ఆ విషయం గుర్తుంచుకుని వ్యవహరించాలి మనుషులు. రోడ్డు ప్రమాదాల్లో రక్తం, అవయవాలు పోగొట్టుకుని దాతల కోసం ఎదురు చూసేవాళ్ళకు తగిన సహాయం చెయ్యాలి . మరణించిన వారి అవయవాలు మట్టిలో , అగ్నిలో కలసిపోకుండా అవయవ దానం చెయ్యాలి . అవి మరికొంత మందికి కొత్త బ్రతుకునిస్తాయి. వీలైనప్పుడల్లా రక్త దానం చెయ్యాలి . అది మరొకరి ప్రాణం నిలబెడుతుంది. తమ దగ్గర ఉన్నవి ఎదుటివాళ్లతో పంచుకోవడం అలవాటు చేసుకోవాలి .

సహాయం చెయ్యడం వల్ల ప్రయోజనాలు ఉన్నాయి. ఎదుటి వాళ్ళకు సాయపడటం వల్ల మనుషుల మధ్య ప్రేమ పెరుగుతుంది. చేసిన సహాయం మనసుల్ని కలుపుతుంది. స్నేహ బంధాలు బలపడతాయి. పరిశుద్ధమైన వ్యక్తిత్వం ఏర్పడుతుంది. మనుషులు మంచివాళ్లవడానికి దోహదపడుతుంది. మానసిక ఆనందం కలుగుతుంది. సహాయం పొందినవాళ్లు కృతజ్ఞతతో చూడడం వల్ల తృప్తి కలుగుతుంది. చేసే సహాయం వల్ల ఇతరుల జీవితంలో పెద్ద మార్పును తీసుకురావచ్చు. సహాయ గుణం ఉన్నవారిని అందరూ ఇష్టపడతారు. వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

సహాయపడటం గురించి భర్తృహరి రాసిన శతకంలోని ఒక పద్యం చదువుదాం.

ద్యుమణి పద్మాకరము వికచముగ జేయు/

గుముదహర్షంబు గావించు నమృత సూతి/

యర్థితుడు గాక జలమిచ్చు నంబుధరుడు/

సజ్జనులు దారె పరహితాచరణమతులు/

ఎవరూ ప్రార్థించక పోయినా తామర కొలకులను వికసింప చేస్తాడు సూర్యుడు. ఎవరూ వేడుకోకపోయినా కలువలను వికసింప చేస్తాడు చంద్రుడు. ఎవరూ కురవమని యాచించక పోయినా వర్షం ద్వారా నీటిని అందిస్తాడు వానదేవుడు. సత్పురుషులు కూడా అంతే . ఇతరులకు మేలు చేయడంలో ఆసక్తి చూపిస్తారు. ఎవ్వరూ అడగకపోయినా ఉపకారం చేయడం వారి సహజ లక్షణం. పరోపకార పరాయణత్వంతో సజ్జనులు సూర్య చంద్రులతోనూ, మేఘాలతో పోటీ పడతారని భావం.

పై శతక పద్యం వర్ణించినట్టు వ్యక్తిత్వంతో , దాన గుణంతో జీవించిన పురాణ పురుషులున్నారు. లేదన్న మాట ఎవరికీ చెప్పకుండా దానాలెన్నో చేసాడు దానకర్ణుడు. పావురం రూపంలో వచ్చిన దేవతలకు శరీరాన్ని కోసిచ్చాడు శిబి చక్రవర్తి. యోగాగ్నిలో శరీరాన్ని దహింప జేసుకుని ఆయుధాల కోసం అస్థికలను దేవతలకిచ్చాడు దధీచి మహర్షి. పులి నుండి ఒక బిడ్డను రక్షించడానికి అర్ధ శరీరం కోసిచ్చాడు మయూర ధ్వజుడు. విశ్వజిత్ యాగం చేసి తనకున్న సంపదనంతా ప్రజలకు దానం చేసాడు రఘుమహారాజు. ఆకలితో నలభై ఎనిమిది రోజులు గడిపినప్పటికీ తమ కోసం వండుకున్న ఆహారాన్ని ఆ సమయానికి వచ్చిన యాచకుల కిచ్చాడు రంతిదేవుడు. ఇలాంటి పుణ్యాత్ముల కథలు చదవడం ద్వారా మానవ ప్రవర్తనలో సహాయ గుణం పెరుగుతుందనడంలో సందేహం లేదు. .

దాన పరోపకార గుణ ధన్యత చిత్తములోన నెప్పుడున్ /

లేని వివేక శూన్యునకు లేములు వచ్చిన వేళ సంపదల్ /

పూనిన వేళ నొక్క సరిపోలును జీకున కర్ధరాత్రి యం /

దైన న దేమి పట్టపగలైన న దేమియు లేదు భాస్కరా/

అంటోంది భాస్కర శతకం.

తమకు కలిగిన దాంట్లో కొంతైనా పరోపకారం కోసం కేటాయించగలిగే గుణాలచే జన్మ సఫలం అవుతుంది. ఆ ఆలోచన లేని వాళ్లకి దారిద్య్రం, కలిమి రెండూ ఒకటే. గుడ్డివానికి రాత్రయినా పగలయినా ఒకటే అన్నట్టు బేధం లేదు. మానవునికి పరోపకార భావన ఉంటే పరులకు ఉపకారం చేస్తాడు. లేనివాడు స్పందించడు. దయా గుణం ఉన్న వారి మనసు కరుగుతుంది. ద్రవీభవిస్తుంది. మనసు కరిగితే ఇతరులను రక్షిస్తాడని నమ్మకంగా చెప్పాడు భాస్కర శతక కర్త.

ఆయన చెప్పినట్టే పరులకు మేలు చెయ్యాలన్న ఉదాత్త ఆశయం, ఆలోచనలు , గుణగణాలున్న గొప్పవారు లోకంలో ఎందరో ఉన్నారు. వారిలో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఒకరు. అవసరంలో ఉన్న వారికి సహాయం చేయడంలో పెద్ద మనసు చూపారాయన. తమ సంపదలో సమాజానికి ఉపయోగపడే విధంగా విరాళాలు ప్రకటించారు. సుమారు 107 బిలియన్ డాలర్లు (2025 నాటికి), సంపదలో 99% ని 2045 నాటికి విరాళంగా ఇవ్వాలని నిర్ణయించారు. ఈ విరాళాలను బిల్ & మెలిండా గేట్స్ ఫౌండేషన్ ద్వారా అందిస్తారు. ఈ ఫౌండేషన్ ఆరోగ్య సంరక్షణ, విద్య, పేదరిక నిర్మూలన వంటి రంగాలలో పనిచేస్తుంది. సంపద ఉండడమే కాకుండా సమాజానికి చేయూత ఇవ్వాలన్న పెద్ద మనసు కలిగి ఉండడం గొప్ప విషయం.

బిల్ గేట్స్ నడిచిన బాటలోనే ఇంకెందరో విదేశీయులు నడిచారు. దానగుణంతో తమ పెద్ద మనసు చాటుకున్నారు. అలాంటి మరి కొందరి గురించి తెలుసుకుందాం.

అమెరికాలో Berkshire Hathaway కంపెనీ అధినేత వారెన్ బఫెట్, “Giving Pledge” అనే ఉద్యమం ద్వారా తన సంపదలో 99 శాతాన్ని దానం చేస్తానని ప్రకటించారు. అతను ఇప్పటికే 50 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విరాళాలిచ్చారు.

అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ మాజీ భార్య మెకెంజీ స్కాట్ , గత కొన్ని సంవత్సరాల్లో 14 బిలియన్ డాలర్లకు పైగా విరాళాల రూపంలో అనేక సామాజిక సంస్థలకు ఇచ్చారు.

ఫేస్ బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ & ప్రిసిల్లా చాన్ కలిపి Chan-Zuckerberg Initiative ద్వారా తమ సంపదలో 99 శాతాన్ని దాతృత్వానికి ఇవ్వాలని నిర్ణయించారు.

ఉపార్జితానాం విత్తానాం త్యాగ ఏవ హి రక్షణమ్/

తటాకోదర సంస్థానాం పరీవాహ ఇవా మ్భసామ్/

అంటోంది హితోపదేశం.

మనుషులందరూ సహాయ గుణం అలవరచుకోవాలని శ్లోకం యొక్క భావం. మరింత వివరంగా చెప్పుకుంటే —- ధనవంతుని దగ్గర ఉండే ధనం, దానం ద్వారా లోకానికి ఉపయోగపడాలి. బలవంతుని యొక్క బలం సమాజ శ్రేయస్సుకు వినియోగించాలి. జ్ఞాని యొక్క విజ్ఞానం దేశ పురోగతికి ఉపయోగించాలి. అలా కాకపోయినట్లైతే ధనాధిక్యత లోభానికి, చౌర్యానికి దారి తీస్తుంది. బలాధిక్యం అనారోగ్యానికీ , దుర్వ్యసనాలకు గురయ్యే అవకాశం ఉంటుంది. జ్ఞాన సంపదంతా అజాగళస్తనం లాగా (మేక మెడ చన్నులాగా ) ఆ వ్యక్తి తోనే నశించిపోతుంది. అందుకే వ్యక్తుల వద్ద ఉండే ధనం త్యాగానికి , భోగానికి పనికి రావాలి. శక్తివంతులు ఆపన్నులను ఆదుకోగలగాలి. విజ్ఞానుల జ్ఞానం నదిలా ప్రవహించి జ్యోతిలా వెలిగి , మానవుల లోపలి చీకట్లను తరిమేస్తూ , ధర్మాచరణానికి ఉపకరిస్తూ, ఇహపర శ్రేయస్సుకు మార్గం చూపాలి.

పై శ్లోకంలో చెప్పినట్టు తమ సంపదలో అధికభాగం పేదలకోసం, ఇతర అభివృద్ధి పథకాల కోసం కేటాయించి ఆదర్శంగా నిలిచిన మహానుభావులెందరో మన దేశంలోనూ ఉన్నారు. వారిలో కొందరి గురించి తెలుసుకుందాం.

ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు నారాయణమూర్తి మరియు ఆయన కుటుంబం అనేక సామాజిక కార్యక్రమాలకు విరాళాలు అందించారు. 2020 సంవత్సరంలో COVID-19 సహాయ కార్యక్రమాల కోసం అక్షయపాత్ర ఫౌండేషన్‌కు రూ. 10 కోట్లు, 2015 సంవత్సరంలో లండన్‌లోని పార్లమెంట్ స్క్వేర్‌లో మహాత్మా గాంధీ విగ్రహం నిర్మాణానికి సుమారు రూ. 2 కోట్లు , వెల్ టెక్ మహాత్మా గాంధీ నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్స్ కోసం రూ. 7 కోట్లు , హార్వర్డ్ యూనివర్సిటీకి భారతీయ సాహిత్యాన్ని ప్రోత్సహించే కార్యక్రమానికి సుమారు రూ. 40 కోట్లు విరాళంగా ఇచ్చారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా విద్య, ఆరోగ్య సంరక్షణ, గ్రామీణ అభివృద్ధి, మరియు కళల ప్రోత్సాహం వంటి రంగాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించారు.

విప్రో కంపెనీ అధినేత శ్రీ అజీమ్ ప్రేమ్ జీ గారు తన సంపదలో 67శాతం అనగా సుమారు 1.75 లక్షల కోట్ల రూపాయలను అజీజ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ ద్వారా విరాళంగా ఇచ్చారు. భారతదేశంలో అత్యధిక విరాళాలు ఇచ్చిన వ్యక్తిగా గుర్తింపు పొందారాయన.

HCL Technologies కి చెందిన శివ నాదర్ తమ సంస్థకి చెందిన ఫౌండేషన్ ద్వారా విద్యకు భారీ విరాళాలు ఇస్తున్నారు. గత కొన్ని సంవత్సరాల్లో 1,000 కోట్ల రూపాయలకు పైగా విరాళాలు ఇచ్చారు.

భారతదేశంలో గొప్ప పారిశ్రామిక వేత్త అయిన రతన్ టాటా, తమ టాటా ట్రస్ట్ ద్వారా విద్య, ఆరోగ్యం, గ్రామీణ అభివృద్ధి వంటి అనేక రంగాల్లో వేల కోట్ల రూపాయల విరాళాలు ఇచ్చారు. టాటా గ్రూప్ లాభాలలో 66 శాతం ట్రస్టులకే వెళ్తోందంటే నమ్మాల్సిందే.

ఆదిత్య బిర్లా గ్రూపుకి చెందిన కుమార మంగళం బిర్లా కూడా “Aditya Birla Centre for Community Initiatives and Rural Development” ద్వారా విద్య, ఆరోగ్యం, మహిళా శక్తీకరణకు అనేక కోట్లు విరాళాలు ప్రకటించారు.

సహాయం అనేది ఎదుటివారి నుండి ఏమీ ఆశించకుండా చేయాలి. కొందరు ప్రతిఫలం ఆశించి చేస్తుంటారు. అది సరైనది కాదు. స్వార్థంతో చేసే సహాయం వల్ల ఒక్కోసారి చిక్కుల్లో పడే అవకాశం ఉంటుంది. మన జానపద కథల్లో చెప్పినట్టు స్వార్థంతో సాయం చేసి నష్టపోయిందట ఒక గుర్రం. అడవంతా ఇష్టమొచ్చినట్టు తిరిగే తన స్వేచ్ఛకు ఒక కొమ్ముల జింక అడ్డు వచ్చిందన్న కోపంతో ఒక మనిషిని కలిసి కొమ్ముల జింకను తరిమేయమందట. దానితో సమానంగా పరిగెత్తడం తన వల్ల కాదని మనిషి చెబితే , తన మీద కూర్చొని స్వారీ చెయ్యమందట. అలా స్వార్థంతో మనిషికి సాయపడిన గుర్రం చివరికా మనిషి దొడ్లో బందీ అయిందట. స్వార్థమాశించి సహాయ పడితే మొదటికే మోసం వచ్చే ప్రమాదముందని గుర్రం కథ తెలిపింది.

అందుకే ఎదుటివారి అవసరాన్ని గుర్తించి అర్హులకే సహాయం చెయ్యాలి. అపాత్రదానం పనికిరాదన్న పెద్దల మాట కూడ గుర్తుంచుకోవాలి.

సహాయం ఆశించడానికి , పొందడానికి కూడ పరిమితులు ఉన్నాయి . కనీస ప్రయత్నం చేయకుండా సహాయం ఆశించడం తప్పు. మానవ ప్రయత్నాలన్నీ పూర్తయ్యాకనే ,తమ వల్ల కాదని తెలిసాకనే సాయం కోరాలి .

ఒకప్పుడు మడుగులో మొసలి చేత బాధించబడిన విష్ణుభక్తుడైన ఏనుగు కూడ తన బలమంతా నశించాక మాత్రమే శ్రీ మహా విష్ణువుని సాయం కోరింది. భక్త సంరక్షణ కోసం సిరికి చెప్పకుండా, శంఖచక్రాలను ధరించకుండానే బయల్దేరాడు లక్ష్మీపతి. తన భక్తుడైన ఏనుగుని రక్షించుకున్నాడు.

కురుక్షేత్ర యుద్ధంలో మొదటి రోజు అర్జునుడు యుద్ధం చెయ్యనని చెప్పినప్పుడు , గీతోపదేశంతో మనసు మార్చాడు తప్ప "నీ తరపున యుద్ధం చేసి విజయకిరీటాన్ని అందిస్తానని' శ్రీకృష్ణుడు హామీ ఇవ్వలేదు. యుద్ధభూమిలో అర్జునుడు పోరాటం ప్రారంభించిన తరువాతే సహాయం చేసాడు.

దీనిని బట్టి మనం తెలుసుకోవాల్సిన విషయమేమంటే కర్తవ్య నిర్వహణలో మన వంతు ప్రయత్నం చేసినప్పుడు అదృష్టమైనా, భగవంతుని అనుగ్రహమైనా అంది వస్తాయి. అంతేకానీ మొట్టమొదటే ఎవరినో ఒకరిని సహాయం చెయ్యమని అడిగి పనులు పూర్తి చేసుకోవాలని చూడకూడదు.

"ప్రతిఫలం ఆశించవద్దు . నువ్వు ఇవ్వాల్సిందేదో ఇవ్వు. అది వెయ్యింతలై తిరిగి నీకు దక్కుతుంది. జీవితమంతా ఇవ్వడమే అని తెలుసుకో. నువ్వు అధికంగా ఇస్తుంటే నీకు అధికంగా లభిస్తుంది. గదిలోని గాలిని ఎంత త్వరగా బయటికి పంపిస్తే బయట గాలి అంత త్వరగా లోపలకు వస్తుంది. అన్ని తలుపులు ద్వారాలు మూసివేస్తే లోపల గాలి లోపలే ఉంటుంది. బయట గాలి లోపలికి రానే రాదు . లోపల గాలి మురికి , కలుషితమై విషంగా మారుతుంది. నది తన నీరు అంతా సముద్రంలో కలిపి నిరంతరం కొత్త నీటితో నిండిపోతుంది. సముద్రంలోకి పోవడానికి ఆటంకపరిస్తే క్షణంలో మృత్యువు కబళిస్తుంది" అని స్వామి వివేకానంద చెప్పిన సత్యాన్ని మరువకూడదు. కలిగినంతలో దానధర్మాలకు కేటాయించాలి.

హృదయ వచశ్శరీరరముల నెంతయు బుణ్యసుధాప్రపూర్ణులై /

ముదము బహుపకారముల మూడు జగంబులకున్ ఘటించుచున్ /

వదలక సాధు సద్గుణ లవంబులు గొండలు సేసి మెచ్చుచున్ /

మదిని వికాస యుక్తలగు మాన్యులు గొందఱు వొవొల్తూ రిద్దరన్ /

భర్తృహరి శతకంలోని మరో పద్యం సహాయ గుణాన్ని చక్కగా వివరించింది. ఆ పద్యం యొక్క భావాన్ని విపులంగా తెలుసుకుందాం. మనస్సు వాక్కు కాయం ఈ మూడింటిని త్రికరణములనే అంటాం. ఈ మూడు పవిత్రంగా ఉండాలి . మనసు పవిత్రంగా ఉన్నప్పుడే మంచి భావనలు కలుగుతాయి. వాక్కు పవిత్రంగా ఉన్నప్పుడే అందరితోనూ చక్కగా వ్యవహరించగలుగుతాం. కాయం పవిత్రంగా ఉన్నప్పుడే మనం చక్కని కర్మలను ఆచరించు గలుగుతాం . ఈ మూడు పవిత్రంగా ఉండడాన్ని త్రికరణ శుద్ధి అంటారు. ఈ త్రికరణ శుద్ధి ఉన్నవాళ్లు ఎప్పుడు సత్కార్యాలనే ఆచరిస్తూ అందరికీ మేలు చేకూరుస్తూ ఉంటారు. అలాగే పరుల్లో ఉన్న ఏ కొద్దిపాటి సద్గుణాన్ని అయినా గొప్పగా చేసి నలుగురికి చెబుతూ ఆనందపడుతూ ఉంటారు . లోకంలో ఇలాంటి మాన్యులైన సజ్జనులు కొద్దిమంది మాత్రమే ఉంటారు. కాబట్టి మానవులు త్రికరణ శుద్ధితో , పరోపకార పరాయణత్వాన్ని అలవర్చుకోవాలని, పరులలో కొద్దిపాటి మంచి గుణాలున్నా, వాటిని ప్రశంసిస్తూ ఆనందించాలని ఈ పద్యం బోధిస్తుంది.

తమకి కలిగిన దానిలో ఇతరులకు లేదనకుండా ఇచ్చిన గొప్పవారున్నారు మన రాష్ట్రంలో . అలాంటి ఇద్దరు మహిళామణులను తలచుకుంటే చాలు వారు చేసిన సేవలు గుర్తొచ్చి ఒళ్ళు పులకరిస్తుంది. వారెవరో కాదు. వారి పేర్లు డొక్కా సీతమ్మ , జిల్లేళ్లమూడి అమ్మ.

తూర్పుగోదావరి జిల్లాకి చెందిన డొక్కా సీతమ్మ (1841–1909) గారు సామాన్య మధ్యతరగతి మహిళ . ఆమె అనేక సంవత్సరాల పాటు అన్నదానం చేసింది. ఎవరైనా ఆకలితో ఆమె ఇంటి ముందుకి వస్తే, అన్నం పెట్టి పంపేది. అలా తన జీవితాంతం దానధర్మాలతో గడిపింది. ఆకలితో ఉన్నవాడు దేవుడేనన్న భావనతో జీవించింది. ఆమె చేసిన పనులు మానవత్వానికి మరో పేరయ్యాయి.

గుంటూరు జిల్లా , జిల్లేళ్లమూడి గ్రామవాసి జిల్లేళ్లమూడి రత్నమ్మ (అమ్మగా ప్రసిద్ధి). ఆమెది నిస్వార్థమైన త్యాగం . అనేక మంది అనాథలు, పిల్లలు, నిరుపేదలకు వసతి, ఆహారం, విద్యాబోధన కల్పించింది. ఆమెను అమ్మగా పిలిచే వారి సంఖ్య వందల్లో కాదు వేలల్లో ఉంటుంది. “ప్రేమ, సమానత్వం, సేవ” అనే బోధనలతో ఆమె జిల్లేళ్లమూడిని ఓ అద్భుతమైన మానవతా కేంద్రంగా మార్చింది. ఆ తల్లి మమకారంతో పేదలకు పంచిన విద్యాబోధన నేటికి ఫలిస్తున్నది. ఎందరెందరో ఉన్నతోద్యోగాలలో స్థిరపడి చక్కని జీవితం గడుపుతున్నారు.

పరహితమైన కార్యమతి భారము తోడిది యైన బూను స /

త్పురుషుడు ల్పొగడ బూర్వము నందొక రాలవర్షము/

స్గురియగ జొచ్చినన్ గదిసి గొబ్బున గోజన రక్షణార్థమై/

గిరినొక కేల నెత్తినట కృష్ణుడు ఛత్రము భాతి భాస్కరా /

అంటోంది భాస్కర శతకం. దీని భావమేమంటే ఇతరులకు మేలు కలిగే పనేదైనా, అదెంత బరువైనదైనా సత్పురుషుడు చేస్తాడు. ఒకసారి రాళ్ల వాన పడుతుంటే గోవుల మరియు గోప జన రక్షణ కోసం గోవర్ధన పర్వతాన్ని చిటికిన వేలుతో గొడుగు మాదిరి ఎత్తాడు శ్రీకృష్ణుడు. తాము పేదవాళ్లయినా సరే అవసరంలో ఉన్న వాళ్లకు ప్రేమతో యధాశక్తి ఇవ్వడానికి ప్రయత్నిస్తారు సజ్జనులు . తాము దుర్దశలో ఉన్నా ఆశ్రితులను కాపాడుతారు. ఇది వారి సహజ గుణం.

ఇది సంపదతో కాదు, మనసుతో చేసే సేవ అన్న మాటకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిన వారు మన మధ్యనే ఉన్నారు . వారిలో కొందరి గురించి తెలుసుకుందాం.

మధ్యప్రదేశ్ కి చెందిన స్వయం ఉపాధి పొందిన పేద రైతు చంద్రశేఖర్ గౌడ్ – తమ గ్రామంలో విద్యాభివృద్ధి కోసం పాఠశాల భవనం నిర్మించడానికి తన సొంత పొలాన్ని దానం చేసాడు.

మహారాష్ట్రలో కూలీగా పని చేసే వ్యక్తి విట్టల్ మాలే -- నెలలో సంపాదించిన కొంత డబ్బును అనాధాశ్రమానికి విరాళంగా ఇస్తూ ఉంటాడు.

ఢిల్లీలో రిక్షాలాగి జీవితం గడిపే ఇర్ఫాన్ అలీ – కరోనా సమయంలో రోడ్డు మీద ఉన్న వారికి ఉచితంగా ప్రయాణం, ఆహారం అందించాడు. తన సంపాదనలో చాలా మొత్తం సహాయానికి వినియోగించాడు.

సహాయం వల్ల కలిగే ప్రయోజనాలను ముందే తెలుసుకున్నాం. మన వల్ల సాయం పొందిన మూగజీవాలు కూడ ఆ సాయాన్ని గుర్తుంచుకుని సరైన విధంగా స్పందిస్తాయని తెలిపే చక్కని కథ చదువుదామా?

ఇటలీ దేశంలో రోమ్ నగరానికి చెందిన ధనవంతుడి దగ్గర ఆండ్రో క్లేను అనే బానిస ఉండేవాడు. అతనికి బానిస వృత్తి మీద విరక్తి పుట్టి ధనవంతుడి ఇంటి నుండి రహస్యంగా పారిపోయాడు. దగ్గరలో ఉన్న అడవులకు వెళ్ళి, ప్రకృతి అందాలను చూస్తూ, దొరికింది తింటూ అక్కడే ఉండిపోయాడు. ఒక గుహ ముందు నుండి అతను వెళుతుంటే ఒక సింహం కనబడింది. దాన్ని చూసి అతడు భయపడ్డాడు. కానీ సింహం అతనికి హాని చెయ్యకుండా , తన కాలిని చూపించి ఆ బాధ పోగొట్టమన్నట్టుగా కాలుని అందించింది. తన ప్రాణాన్ని లెక్కచేయకుండా ఆ సింహం యొక్క కాలుని పరిశీలించి, కాలు క్రింద భాగంలో గుచ్చుకుని

ఉన్న ఒక ముల్లుని , నేర్పుగా బయటకు తీసి పారేసాడు. అలా ఆ సింహం బాధని పోగొట్టాడు . అప్పటి నుండి అతను , సింహం స్నేహితుల్లా మారిపోయారు.

ఒకసారి ఆండ్రో క్లేనుని అడవిలో చూసిన ధనవంతుడి మనుషులు అతన్ని బలవంతంగా ఎత్తుకు పోయి ధనవంతుడికి అప్పగించారు. రోమ్ నగర చట్టప్రకారం బానిసకు మరణశిక్ష విధించారు. శిక్ష అమలు పరచడం కోసం అక్కడి పద్ధతి ప్రకారం అతన్ని కటకటాలతో చుట్టబడిన ఒక గుండ్రని ప్రదేశంలో ఉంచారు. ఇతని మీదకు వదలడానికి అరణ్యంలో పట్టుబడ్డ ఒక సింహాన్ని తెచ్చారు. ఆ సింహం అతన్ని ఎలా చీల్చి చంపుతుందో చూడడానికి జనం కటకటాల వెనక నిలబడ్డారు.

అయితే అది ఇదివరలో ఆండ్రో క్లేన్ వల్ల సహాయం పొందిన సింహమే కావడంతో అతన్ని చంపకుండా దగ్గరకు వచ్చి ప్రేమగా అతని పాదాలను నాకుతూ ఉంది. చుట్టూ ఉన్న జనం ఆశ్చర్యపోతూ చూశారు. అతనెప్పుడో చేసిన సేవకు, సహాయ గుణానికి ఆ సింహం తిరిగి అతని పట్ల చూపించిన కృతజ్ఞత అది.

“వస్తా వట్టిదే పోతా వట్టిదే ఆశ ఎందుకంటా / చేసిన ధర్మము చెడని పదార్థం చేరును మీ వెంటా! “ అని ఒక పాటలో చెప్పినట్టు ఆ బానిస ఎప్పుడో సింహానికి చేసిన ఉపకారం అతడి ప్రాణాన్ని రక్షించింది. అందుకే అవకాశం ఉన్నప్పుడు సహాయం చేయడానికి వెనుకంజ వెయ్యకూడదు.

నాణానికి బొమ్మ బొరుసులున్నట్టే సహాయ గుణానికి రెండు కోణాలున్నాయి . ఇంతవరకు సహాయపడాలన్న కోణాన్ని మాత్రమే చర్చించాం. ఇప్పుడు సహాయం ముసుగులో దుర్వినియోగానికి పాల్పడిన వారి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపే రెండో కోణం చూద్దాం.

నేటి సమాజంలో నైతిక విలువలు పతనమైన కారణంగా అనేక ఘోరాలు జరుగుతున్నట్టే , సులభ సంపాదన కోసం కొత్త దారులు తొక్కుతున్నారు మోసగాళ్లు. కొత్త పద్ధతులు అవలంబిస్తూ జనాల డబ్బు దోచుకుంటున్నారు. అందుకు హైటెక్ పద్ధతులు ఉపయోగిస్తున్నారు.

నేటి కాలంలో టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందిందంటే ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ స్మార్ట్ ఫోను కనబడేంత. దానికి తోడు సామాజిక మాధ్యమాల్లో వ్యక్తుల ఏక్టివిటీ పెరిగింది. మెసేజింగ్ యాప్స్ లో ఖాతాల నిర్వహణ కూడ పెరిగింది. దీన్ని అవకాశంగా తీసుకున్న మోసగాళ్లు రెచ్చిపోతున్నారు. ఫేస్ బుక్ , వాట్సాప్ , టెలిగ్రామ్, ఇన్ స్టా గ్రామ్ , మెసెంజెర్ వంటి యాప్స్ ద్వారా అమాయకుల ఖాతాలను హ్యాక్ చేస్తున్నారు. అసలైన ఖాతాదారుల మాదిరి వారి మిత్రబృందాన్ని నమ్మించే మెసేజిలు పంపుతున్నారు. తాము ఆపదలోనో , అవసరంలోనో ఉన్నట్టు చెబుతూ , ధన సహాయం కోరుతున్నారు . నగదు ఉన్న పర్స్ మరచిపోయి మార్కెట్ కి వెళ్లినట్టు , పర్స్ దొంగిలించబడినట్టు , ఏక్సిడెంట్ అయి ఆసుపత్రిలో ఉన్నట్టు చెబుతూ అర్జెంట్ గా డబ్బు బదిలీ చెయ్యమని కోరుతున్నారు. ఆ డబ్బుని రెండు రోజుల్లో తిరిగి చెల్లిస్తామని నమ్మిస్తున్నారు. అలా అడిగింది తమ మిత్రుడేనన్న విశ్వాసంతో సహాయపడిన వాళ్ళు ఉన్నారు. అలా పంపబడిన డబ్బు ఎవరెవరో మోసగాళ్ల ఖాతాకి వెళ్ళిపోతుంది.

అలాంటి అభ్యర్థనలను నమ్మి సాయపడాలంటే సందేహం కలిగే రోజులొచ్చాయి. అలా అని సాయం చెయ్యకపోతే నిజంగానే తమ మిత్రుడు ఆపదలో ఉంటే వాళ్ళ పరిస్థితి ఏమిటనే భయమూ కలుగుతోంది. అందుకే ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుని డబ్బు అడిగిన మిత్రులకు కాల్ చేసి , తమకు వచ్చిన మెసేజ్ నిజమా కాదా అన్న విషయాన్ని నిర్ధారించుకోవాలి. వారి పట్ల పూర్తి నమ్మకం కలిగితేనే సాయపడాలి.

సహాయం ముసుగులో మరోరకమైన మోసం కూడ జరుగుతుంది. హిందువులకున్న దైవ భక్తి గ్రహించిన మోసగాళ్లు దేవుడి పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారు. తమ వూరిలో దేవాలయం నిర్మిస్తున్నామని , చందాలు వసూలు చేస్తున్నామని ధన సహాయం అడుగుతారు. అందుకు రసీదు పుస్తకాలు ముద్రించి , పేరు గోత్రం రాసి చేతిలో పెడతారు. అలా అడిగిన వాళ్లలో కొందరే నిజమైన భక్తులు. మిగతా వాళ్లు మోసగాళ్ళు. వాళ్లకు అదే పని. ఒక రిక్షాకి దేవుడి పోస్టర్లు అతికించి మైకులో అభ్యర్థిస్తారు. నమ్మిన వాళ్లు కొందరైనా ధన సహాయం చేస్తుంటారు.

ఇంకొందరు 365 రోజులూ అయ్యప్ప దుస్తుల్లో, దుర్గామాత భక్తుల దుస్తుల్లో బస్ స్టాండుల్లో, రైల్వే స్టేషన్లలో యాచన చేస్తూ ధన సహాయం కోరుతూ ఉంటారు. ఒకప్పటి కాలంలో అయితే తిరుపతి వెళ్లే భక్తులు యాచన చేసి తిరుపతి కొండకు వెళ్తామని మొక్కుకునేవాళ్ళు. ఇలాంటి వారు తమకు తెలిసిన ఎంపిక చేసిన గృహాలకు వెళ్లి తమ పరిస్థితి చెప్పి యాచన చేసేవాళ్ళు. తోచింది వాళ్ల చేతిలో పెట్టేవారు భక్తులు . తమ తరపున హుండీలో వేయమని మరికొంత డబ్బు కూడా ఇచ్చి పంపేవారు. ఇప్పుడదంతా మారిపోయింది.

మోసగాళ్లు దీన్ని తమకి అనుకూలంగా మార్చుకుని యాచన పేరుతో ధన సహాయం పొందుతున్నారు. మరికొందరు మహిళలు చంటి పిల్లల్ని చంకన ఎత్తుకుని నగర కూడళ్లలో , సిగ్నల్ వ్యవస్థ దగ్గర సాయం కోసం చూస్తుంటారు. వారిలో ఎవరు నిజమైన యాచకులో , ఎవరు వ్యాపారం చేస్తున్నారో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది.

సహాయం చేసే ముందు బాగా ఆలోచించి చెయ్యాలని చెప్పడానికే ఇదంతా చర్చించాను.

మానవ జన్మ ఎత్తిన మనం మంచిని మాత్రమే దర్శించాలి. పదవి, అధికారం, హోదాలను తాత్కాలికమైన విషయాలుగా గుర్తించాలి. సహాయ సహకారాలను అందించడానికి జీవితం ఇచ్చే అవకాశాలను వినియోగించుకోవాలి . ఆహార పాత్రలో మిగిలిపోయిన నాలుగు మెతుకులు కూడా నాలుగు ప్రాణులకు ప్రాణాధారం అవుతాయన్న సంగతి గుర్తు పెట్టుకుని సహాయగుణం పెంచుకోవాలి . సహాయం చేసే వారంతా ఒక్క విషయం గుర్తుపెట్టుకోవాలి.

“సహాయం చేస్తే మరచిపో - సహాయం పొందితే గుర్తుంచుకో” . అప్పుడే మానవత్వం ఉన్న మనిషి కాగలం.

——@@@@@@——-